క్లుప్తంగా

టాపర్స్‌కు అభినందనలు



కొడకండ్ల: మండలకేంద్రంలోని టీఎస్‌ఆర్‌ఎస్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి టాపర్స్‌ను గురువారం జనగామ కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అభినందించారు. 10/10జీపీఏ సాధించిన విద్యార్థులు శనిగరపు అనూదీప్య, నర్మెట్ట యామిని, చింతకింది స్పందనలను కలెక్టర్ అభినందిస్తూ భవిష్యత్‌లోనూ బాగా చదువుకొని ఉన్నత ఖ్యాతిని గడించాలన్నారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి..



జనగామ రూరల్: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని పెంబర్తి పాఠశాల విద్యార్థి బి.అజయ్‌కుమార్ 10/10జీపీఏ సాధించాడు. కాగా, డీఈఓ రాము విద్యార్థిని తన కార్యాలయంలో గురువారం అభినందించారు.

నిత్యావసరాల అందజేత



పాలకుర్తి టౌన్: మండలంలోని విస్నూరులో ఇటీవల బావిలో ఈతకు వెళ్లి కైతుజు సాయి మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి గురువారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ సహకారంతో బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీష్, అబ్బోజు యాకస్వామి పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

పాలకుర్తి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును ఇచ్చి కండక్టర్ నిజాయితీని చాటుకున్నాడు. గురువారం జనగామ నుంచి పాలకుర్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు జడల రమేష్ పర్సు పడిపోగా కండక్టర్ రవి తిగిరి అతని వివరాలను సేకరించి అందజేశాడు. బాధ్యతగా ప్రయాణికుడి పర్సును అందజేసిన కండక్టర్‌ను ప్రయాణికులు అభినందించారు.

పరామర్శ



పాలకుర్తి టౌన్: మండలంలోని పెద్దతండా(బి)కి చెందిన జిల్లా రైతుబంధు సమితి డైరెక్టర్, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు జరుపుల బాలునాయక్ కుడి కాలుకు గాయాలు కాగా గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మంత్రి వెంట ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ యాకంతారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మార్కెట్ చైర్మన్ రాంబాబు, ఎంపీటీసీ చత్రునాయక్ పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం



తరిగొప్పుల: ప్రభుత్వ నిషేధిత గుడుంబా అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. మండలంలోని అంకుషాపూర్ పరిధిలో గురువారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా గ్రామానికి చెందిన మాటూరి రామస్వామి అనుమానాస్పదంగా కనబడడంతో తనిఖీ చేయగా ప్యాకెట్లలో (7 లీటర్ల) గుడుంబా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. సదరు వ్యక్తిని విచారించగా మండలంలోని వాచ్యాతండా శివారు దేశ్యాతండాకు చెందిన అజ్మీర దేవేందర్ తనకు సరఫరా చేస్తున్నట్లు తెలిపాడు. మాటూరి రామస్వామి, అజ్మీర దేవేందర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లారీడ్రైవర్‌కు జైలు

లింగాలఘణపురం: మద్యం సేవించి వాహనం నడిపిన కొడకండ్లకు చెందిన లారీ డ్రైవర్ ధరావత్ సురేందర్‌కు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,600 జరిమానాను జనగామ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్‌రాంనర్సయ్య విధించినటుల ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఈ నెల 10న కుందారం క్రాస్ రోడ్డులో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధికి మారుపేరు కేసీఆర్

- మల్లన్న సాగర్‌తో తీరిన తాగునీటి సమస్య
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

నర్మెట: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే అభివృద్ధికి మారుపేరుగా నిలిచారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ తేజావత్ గోవర్దన్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రూ. 375 కోట్లతో నిర్మించిన మల్లన్న సాగర్ నిర్మాణం లింక్‌అప్‌తో జనగామ నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని, రూ. 100 కోట్లతో నిర్మాణం చేపట్టిన వైద్యకళాశాల జనగామకే తలమానికంగా నిలువనుందని అన్నారు. రూ. 37 కోట్లతో క్రిటికల్ కేర్ ఆస్పత్రి నిర్మాణం మరో రూ.17 కోట్లతో ఉన్నత ప్రమాణాలతో కూడిన మౌలిక వసతుల కల్పన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా 100 మందికి (60 బాలికలు, 40 బాలురు) వైద్యవిద్య సదుపాయం కలుగనుందని తెలిపారు. మహిళల పురిటినొప్పుల బాధను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ జనగామలో ఎంసీహెచ్ నిర్మాణం చేపడ్డం మన అదృష్టమని అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఆరోగ్య శాఖా మంత్రి హరీష్‌రావుకు ఈసందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులైన అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పని సరిగా సమావేశాలకు హాజరై అభివృదికి తోడ్పాటును అందించాలని సూచించారు. అనంతరం ఆయాశాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్, ఎంపీడీఓ ఎం డి.ఖాజామొయిఉద్దీన్, తహసీల్దార్ పారునంది శ్రీనివాస్, సీఐ పాటి నాగబాబు, ఎంపీఓ అరవింద్ చౌదరి, వైస్ ఎంపీపీ ఆగిరెడ్డి, ఏపీఎం నాగేశ్వర్ రావు, ఏపీఓ రమాదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

15నుంచి సీఎం కప్ క్రీడాపోటీలు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎంపీపీ రేఖ

నర్మెట: ఈనెల 15నుంచి నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని క్రీడల చైర్మన్ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, ఎంపీడీఓ ఖాజా మొయినొద్దీన్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను ఈనెల 15నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన టీంలను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని, జిల్లా స్థాయిలో విజయం సాధించిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. గెలుపొందిన వారికి కప్, నగదు పారితోషికాలు అందజేస్తారని చెప్పారు. ఔత్సాహికులైన 15–36 వయస్సు కల్గిన క్రీడాకారులు పూర్తి వివరాలకు నర్మెట, వెల్దండ, హన్మంతాపూర్ పాఠశాలల పీఈటీలను సంప్రదించాలని తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 15నుంచి డివిజన్ కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ కందుల రేఖ తెలిపారు. సీఎం కప్ నిర్వహణపై స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. పూర్తి వివరాల కోసం 9502953937 నంబర్‌లో సంప్రదించాలన్నారు. తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు పాల్గొన్నారు.

క్రీడలను విజయవంతం చేయండి

లింగాలఘణపురం: సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ చిట్ల జయశ్రీ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన క్రీడలపై సమీక్షించారు. ఎంపీడీఓ మల్లికార్జున్, తహసీల్దార్ అంజయ్య, ఎస్సై ప్రవీణ్, డాక్టర్ కరుణాకర్‌రాజు, పీడీ భిక్షపతి తదితరులు ఉన్నారు.

జఫర్‌గఢ్: సీఎం కప్–2023 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడల చైర్మన్, ఎంపీపీ రడపాక సుదర్శన్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు క్రీడలు మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయని తెలిపారు. వివరాల కోసం 9849683470, 9394553727 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన గ్రామ దేవతల ఉత్సవాలు



పూజలు చేస్తున్న బండా ప్రకాశ్

రఘునాథపల్లి: మండలకేంద్రంలో పది రోజుల పాటు నిర్వహించిన గ్రామదేవతల ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. బుధవారం రాత్రి గ్రామస్తులు ఊరుమ్మడిగా విజయదుర్గాదేవికి డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. తెల్లవారే దాక ఆలయం వద్ద డుబ్బులోళ్లు చెప్పిన కథలకు భక్తులు ముగ్ధులయ్యారు. గురువారం ఉదయాన్నే డుబ్బులోళ్లు ఆలయం వద్ద గావు పట్టడంతో గ్రామస్తులు కోళ్లు, యాటలు బలిచ్చారు. విజయదుర్గాదేవికి మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటి చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విజయదుర్గాదేవికి పూజలు చేశారు.

వాటర్ ప్లాంట్ మూసివేతతో ఇబ్బందులు



మూతబడిన వాటర్‌ప్లాంట్

దేవరుప్పుల: వాటర్ ప్లాంట్ మరమ్మతుకు నోచుకోకపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్న తీరు కామారెడ్డిగూడెంలో జటిల సమస్యగా మారింది. ఇటీవల ఉత్తమ తాగునీటి సరఫరా గ్రామంగా అవార్డు అందుకున్న తరుణంలో ప్రజలకు శుద్ధినీరు అందించే విషయంలో నెల రోజులు గడిచినా పంచాయతీ పాలకవర్గం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యవైఖరిపై సర్వత్రావిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై సర్పంచ్ బిల్లా అంజమ్మయాదవరెడ్డి వివరణ కోరగా వాటర్ ప్లాంట్ నిర్వహణ టెండర్‌దారుడి నిర్లక్ష్యంతో మూతపడింది వాస్తవమే, పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడుతామన్నారు.

'అధికారంలోకి రావడం ఖాయం'



మాట్లాడుతున్న చేపూరి వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్: దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనతో ప్రజలు విసుగుచెంది ఉన్నారని, రానున్న రోజుల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ కార్యదర్శి చేపూరి వినోద్ అన్నారు. డివిజన్‌కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు చేసిన హామీలను విస్మరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతూ నిరంకుశ, నియంత పాలన సాగిస్తున్నాయన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీవైపు చూస్తున్నారని తెలిపారు. గత కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని, బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న అవినీతిపై ప్రజలను చైతన్యం చేసేలా నేటి నుంచి నియోజకవర్గంలో తన ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు బస్టాండ్ సమీపాన అంబేడ్కర్ సర్కిల్ నుంచి యాత్ర ప్రారంభిస్తామని, స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, పాంనూర్, నమిలిగొండ గ్రామాల్లో యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. యాత్రకు పార్టీ కుటుంబ సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వీఓఏల నిరవధిక సమ్మె



సమ్మెలో నినాదాలు చేస్తున్న ఐకేపీ వీఓఏలు

లింగాలఘణపురం: మండలంలోని ఐకేపీ వీఓఏలు నిరవధిక మెరుపు సమ్మెలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నెల 19న సమ్మె నోటీసు ఇచ్చిన వీఓఏలు దీక్ష శిబిరం ఏర్పాటు చేసి సమ్మెను ప్రారంభించారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, ఆరోగ్య బీమా ఇవ్వాలని పలు డిమాండ్లతో సమ్మెను చేపట్టారు. సమ్మెలో వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి తహరాబేగం, ఉపాధ్యక్షురాలు ఎం. సరిత, కోశాధికారి నీలం సునిత, సహాయ కార్యదర్శి నాగరాజు, ఈ పద్మ, నీలం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సాదిక్ అలీ

బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఇబ్బంల్లో ఉన్నారని వాటిని పరిష్కరించేందుకు మార్గాలను వెతుకాలని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ అన్నారు. గురువారం మండలంలోని నక్కవానిగూడెం, ఇటుకాలపల్లి, కొన్నె గ్రామాల్లో పర్యటించి రైతులను కలిశారు. అనంతరం సాదిక్ అలీ మాట్లాడుతూ ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వినయలతకు అందజేశారు. రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య హోమం

లింగాలఘణపురం: మండలంలోని బండగుట్ట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం వైభవంగా నిత్య హోమం నిర్వహించారు. ఈ నెల 12న లక్ష్మీనృసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో వేదపండితులు సుదర్శన శ్రీనివాసాచార్యులు, సముద్రాల గోపీకిశోరాచార్యుల వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని భక్తులు హాజరుకావాలని కోరారు. సర్పంచ్‌లు విజయకుమార్, విజయ్‌మనోహర్, ఆలయ సేవ సంఘం సభ్యులు వంచ మహేశ్వర్ రెడ్డి, రాంరెడ్డి, దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నియామక పత్రాలు అందజేస్తున్న వసంత

రఘునాథపల్లి: మండలంలో వైఎస్సార్ టీపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, వైఎస్‌ఆర్ అభిమానులు కృషి చేయాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు ముసిపట్ల నరేష్‌బాబు పిలుపు నిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రాజన్న రాజ్యం తీసుకరావడానికి నిరంతరం శ్రమిస్తున్న తమ పార్టీ అధ్యక్షురాలు షర్మిలక్కకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. గ్రామ గ్రామాన పార్టీ కమిటీలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌టీపీ మహిళా కమిటీలు

వైఎస్సార్‌టీపీ విభాగం మహిళా మండల పొదుపు సంఘాల అధ్యక్షురాలిగా మండలంలోని కోమళ్ల గ్రామానికి చెందిన చింతల ఎలేంద్ర నియామకం అయ్యారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శిగా వేల్పుగొండ రజిత, మేకల కళమ్మలను సంఘం జిల్లా అధ్యక్షురాలు చెంపాల వసంత గురువారం నియామకపు ప్రతులు అందజేశారు. బొల్లెపల్లి సత్తయ్య, వేల్పుగొండ బిక్షపతి, జనగామ పట్టణ అధ్యక్షుడు వెంకటరత్నం పాల్గొన్నారు.

పుస్తె, మట్టెలు బహూకరణ

జనగామ రూరల్: పట్టణంలోని సంజయ్ నగర్‌కి చెందిన దివంగత కొల్లూరు విజయ రాములు కుమార్తె రేవతి పెళ్లి సందర్భంగా గురువారం గట్టు సిద్దులు, కృష్ణ పుస్తె, మట్టెలు అందజేశారు. అనాథ అమ్మాయికి ఎక్కాల దేవి రజిని, ఓంకార్ దంపతులు కన్యాదానం చేస్తున్నట్లు తెలిపారు. సతీష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' ఔదార్యం

కొడకండ్ల: మండలంలోని రేగుల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన కుమారస్వామి గురువారం మృతి చెందగా అతడి అంత్యక్రియలకు తోడ్పాటు అందించి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఔదార్యం చాటుకుంది. వివరాలు ఇలా..నిరుపేద కుటుంబానికి చెందిన కుమారస్వామి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్యపరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. అతడి అంత్యక్రియలు నిర్వహించడంలో కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు విరాళాలు సేకరించి అండగా నిలిచారు. మృతుడి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



కొడకండ్ల: మాట్లాడుతున్న ఎంపీడీఓ



దేవరుప్పుల: కుట్టు సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి

కొడకండ్ల: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సురేందర్‌నాయక్ కోరారు. గురువారం శ్రీవెంకటేశ్వర మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొడకండ్ల, రామవరం గ్రామాల్లో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఏపీఎం సత్యనారాయణ, ఏపీఓ కుమారస్వామి, సీసీలు దండెంపల్లి సోమయ్య, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

దేవరుప్పుల : తెలంగాణ ప్రభుత్వం మహిళాసాధికారత కోసం ప్రత్యేక కృషి చేస్తుందని సర్పంచ్ ఈదునూరి రమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మంత్రి దయాకర్‌రావు సహకారంతో డీఆర్‌డీఓ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెండో విడత ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఉపాధి కల్పన కోసం ఇచ్చే ఉచిత శిక్షణను పొంది అర్హులు టెక్స్‌టైల్ పార్కులో లభించే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీఓ సురేష్ కుమార్, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ తోటకూరి రేణుక కిష్టయ్య , ఉప సర్పంచ్ దశరథ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, వార్డు సభ్యులు తోటకూరి రామచందర్,ఐకెపి సీసీ వసంత, వీఓఏ జక్కుల గంగరాజు,గ్రామ కార్యదర్శి వెంకన్న, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పూడికతీతతో భూగర్భజలాల పెంపు



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న విజయ్‌పాల్‌రెడ్డి

తరిగొప్పుల: చెరువుల పూడికతీతతో భూగర్భ జలాలు పెంపొందుతాయని లోడీ సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. లోడీ సంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో గురువారం మండల పరిధిలోని పలు గిరిజన తండాలలో చెరువుల పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జాలుబాయితండా, పంతులు తండా, మాన్‌సింగ్‌తండాలలో చెరువులు పూడికతీత పనులు చేపట్టారు. విజయ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో చెరువులలో నీరు లేకపోవడం వల్ల నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని చెరువులు పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలశౌరి, ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ఫీల్డ్ స్టాఫ్ కనకం రవీందర్, భూక్య బిచ్చ, తిరుమల, రమేష్, సర్పంచ్ లకావత్ నంద్యానాయక్, సబావత్ రాజు, ఇరుమల్ల రాజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

జఫర్‌గఢ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరాజు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో జఫర్‌గఢ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

బీమా చెక్కు అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గుండె కొమురయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబానికి పార్టీ నుంచి వచ్చిన రూ.2లక్షల బీమా చెక్కును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర పార్టీ కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొమురయ్య పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడంతో పార్టీ నుంచి రూ.2లక్షల చెక్కు వచ్చిందన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల యాదవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర గురువారం అతడిని పరామర్శించారు.

సమన్వయంతో పనిచేయాలి

బచ్చన్నపేట: అధికారులు నాయకులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణాల అభివృద్ధి గ్రామాల నుంచే మొదలవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ఇలా.. తినేదెలా..?

రేషన్ బియ్యం చూసి భయపడుతున్న జనం



నీటిలో తేలుతున్న బియ్యం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని చౌకధరల దుకాణాల నుంచి ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం కల్తీవి రావడంతో ఆ బియ్యాన్ని తినేందుకు జనం జంకుతున్నారు. బియ్యంలో కొన్ని తెల్లగా ఉండి నీటిలో నానబెడితే తేలియాడుతున్నాయి. బియ్యంలో సగం మంచివి కాగా మరికొన్ని పేలాలలా ఉన్నాయి. వీటితో వంట చేసుకొని తింటే ఏమవుతుందోనని భయపడుతున్నారు. మండల కేంద్రంలోని రేషన్ షాపు–1లో ఈ నెల తీసుకొచ్చిన బియ్యం పూర్తిగా కల్తీమయమయ్యాయి. ప్రతి నెల రేషన్ బియ్యం తినే నిరుపేదలు ఆ బియ్యాన్ని వంట చేసుకోలేకపోతున్నారు. ఈ నెల ఎలా గడుస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల ఎలా తినాల్నో ఏమో..



అంత్యోదయ రేషన్ కార్డుతో నెలకు 35 కిలోల బియ్యం వస్తున్నాయి. ఈ నెల వచ్చిన బియ్యం తినాలంటే భయమేస్తుంది. అంతా కల్తీగా వచ్చాయి. జల్లెడ పట్టితే తెల్లగా కొన్ని బియ్యం వస్తున్నాయి. నీటిలో అవి నానడంలేదు. తేలుతున్నాయి. ఈ నెల ఎలా తినాలో ఏమో. వచ్చే నెలలోనైనా మంచి బియ్యం ఇవ్వాలి.

– బీపాషా, లింగాలఘణపురం